# అడవిచెట్టు



**నా** మీద నాకే అసహ్యం!

అంతాఇంత కాదు. మనసు విప్పి చెప్పలేనంత. ఒక మనిషికి తనమీద తనకే చెప్పలేనంద అసహ్యం. ఛూత్! అంతకంటే చావుమేలు. చచ్చి ఏమి సాధిస్తావ్? పరస్పర విరుద్ధమైన ఆలోచనల అలలు అలమీద అలగా ఎడతెరపి లేకుండా చెలరేగుతున్నది అల్లకల్లోలమైన ఈ మనస్సు సరస్సులోనే. అయినా ఒకదానితో ఒకటి ఎడాపెడా తలపడతాయి. ఒకటి ఓడుతుంది. మరొకటి గెలుస్తుంది!

ఆ గెలుపు నన్ను లొంగదీసుకొంటుంది.

అందుకే కడుపులో ఒక అక్రమ పిండాన్ని మోసినంత రోతగా... అసహ్యం గరళ కంఠమైతే సహిస్తూ బతకాలి. తప్పదు. అయితే ఎందుకు బతకాలి? ఎవరికోసం బతకాలి? ఎంతకాలమని బతకాలి? ఎదురు తిరుగుతూ ప్రశ్నలు. ప్రశ్నకేదో ఒక సమాధానం ఉండాలి. ప్రయత్నిస్తే

అది దొరకాలి. ఎంతప్రయత్నించినా దొరకనపుడు మనసు కుదటపడదు. కుదట పడని మనస్సు ఒకచోట కుదురుగా కూర్చోనివ్వదు. కాలుగాలిన పిల్లితో పోటీ! ఎంతసేపని? ఎంతకాలమని?–

ఈ బలహీనత– మనస్సు జుట్టు వొడిసి పట్టుకొని లొంగదీసుకుంటే చేతులు అతి దీనంగా పైకి లేస్తాయి– ప్రశాంతతను ఆహ్వానిస్తూ. హుం! ప్రశాంతత. అది అంగట్లో అమ్మే సరుకు కాదని తెలుసు. అది శ్రమించి సాధించాల్సిన ఒక అలౌకిక స్థితి అని తెలుసు. ఆ స్థితిని సాధించేశక్తిని మనస్సు ఎప్పుడో కోల్పోయిందని తెలుసు. అందుకే శాశ్వత నిద్రలోనే ఆ ప్రశాంతతను వెదుక్కోవాలని మనసు ఆరాటపడ్తూ ఉంది.

ఆ ఆరాటాన్ని ఆప్యాయంగా చేరదీసి మనస్సు ఉయ్యాల్లో పడుకోబెట్టి 'ఆత్మహత్య మహాపాపం! మహాపాపం!' అంటూ జోకొడుతుంది.

అంతే! చావు అనే పిరికిమందు ఒక్కరాగాన మింగుడు పడదు.

చావాలనుకొన్నా చావలేనపుడు బతకాలి. క్షణం క్షణం నన్ను నేను అసహ్యించుకొంటూనే బతుకుతున్నాను. ఈ బతుకు వద్దనుకొంటూ బతకడం ఒక అసహ్యం. చావలేక బతకడం ఒక అసహ్యం. గాలిదూరని ఒక చీకటి గుయ్యారం లోనికో..దుర్గంధ భూయిష్టమైన వాతావరణం లోనికో బలవంతంగా నెట్టేసి "బతకతావో? చస్తావో?' తేల్చుకో అన్నట్లుంది నా పరిస్థితి. ఆవాతావరణంలో నుంచి బయటపడలేను. అక్కడేపడి చావలేను.

ఈ పరిస్థితిలో ఏడవాలి. ఎలుగెత్తి ఏడవాలి. అయితే ఏడ్చి ఏడ్చి నేలతల్లి గుండెల్లో వృథాగా ఇంకిపోయిన కన్నీళ్లెన్ని? కన్నీటివాగులైన చెంపలు... ఓదార్పు అరిచేతులు. పరస్పర ఆత్మీయతానుబంధం తెగి దేనిదారిదానిదైతే? ఏడుపు మీదనే రోత పుట్టింది. ఇప్పుడు ఏడవలేక నవ్వాలనిపిస్తుంది. అయినా కాలిన చేతుల్ని చూసి ఆకులే నవ్వుతున్నాయి.

ప్రతిక్షణం గుండెమెడలు విరుస్తున్న ఈ బరువును మోయలేను. దించమని ఎవరినీ అడగలేను. అలా అడగాలంటే ఎవరిచెవిలో అయినా వేయాలికదా? గోడలకు చెవులున్నా యంటారు. అయితే నా ఇంటి గోడలకు చెవుడని నాకు తెలుసు.

నిజం. పొద్దు తూర్పున్నే పుట్టుతుందన్నంత నిజం. నాకంటే ఒక కుష్టురోగి ఎంతోమేలు. వాడు తన రోగాన్ని అసహ్యించుకొంటూనే ఆనందంగా జీవిస్తాడు. దర్జాగా వీధుల్లో పడతాడు. ఒంటిమీద రోగం వికృతస్వరూపానికి చిహ్నాలైన పుండ్లమీద మరింత ఎర్రరంగు దట్టిస్తాడు. పుండ్లు మోదుగ మొగ్గలై కండ్లల్లో కరుణగా విచ్చుకుంటే వ్యాపార జీవితాల్లో అపారమైన సానుభూతిని సాధిస్తాడు. ఆ పుండ్లతో పోటీపడే నావొంటిమీద గాయాల్ని ఎలాచూపను? ఎవరికి చూపను??

ఒక శాడిస్ట్ చేతిలో మండుతున్న సిగరెట్ కుంచె అతి సుకుమారమైన నా రొమ్ముల్ని... పొత్తికడుపు కింద భాగాల్ని...తొడల్ని కాన్వాసుగా వాడుకొని గీసిన పిచ్చి గీతలు వాడికసికి ప్రతీకలుగా! నా మోహతీవ్రత వేసిన తప్పటడుగు బహూకరించిన వెక్కిరింతలకు ఆనవాళ్ళుగా!

సిగ్గుమాలి ఎలా చూపను? ఎవరికి చూపను?

ఎప్పుడో ఒకప్పుడు...వేళకానివేళలో...మనసు వశం తప్పుతుంది. ఆవేశం ఒళ్ళంతా ఆక్రమిస్తుంది. ఏకాంతం ప్రేరేపిస్తుంది. రవిక ముడివీడుతుంది. చీరకుచ్చిళ్ళు మెల్లమెల్లగా పైకిలేస్తాయి. రెప్పలనుండి జారిపడిన చూపులు గాయాల్ని గుచ్చుతుంటే? ఫ్!...

...నా పైన నాకే ఎంత అసహ్యమో?

ఈ అసహ్యాన్ని జీర్ణించుకోలేక ఛావాలన్న బలమైన కోరిక.

"వద్దు. వద్దు. ఏ పరిస్థితిలోనూ అటువంటి కోరికకు లొంగొద్దు. ఏదైనా బతికే సాధించాలి." అంటూ మనసు ఎదురు తిరుగుతుంది. మెదడులో కవ్వమేసి కెలికినట్లు ఒక కలకలం. ఆ కలకలం నుండి ఊపిరి పోసుకుంటూ ఎన్నో చేదు అనుభవాలు. ఆ అనుభవాలు దృశ్యమానమైతే కోపం. కోపం కొంకర్లు తిరిగితే పట్టుదల. ఆ పట్టుదల ఈ అసహ్యాన్ని తీపిమందుగా మార్చిదిగమింగిస్తుంది. గొంతు దాటిన మందు తనపని తాను చేస్తుంది. మళ్ళీ బతుకుమీద ఆశ. ప్రతీకారజ్వాల. నన్ను జీవచ్ఛవంలా బతికిస్తున్నాయి. ఇలా బతికి ప్రయోజనం! అందుకే నిస్సహాయత మీద యుద్ధం ప్రకటించాలి. ఈ పురుషాహంకారానికి విరుగుడు ఆలోచించాలి. మనస్సు పెట్టి ఆలోచించాలే కానీ మెదడు పొరల్లో నిక్షిప్తమైన ఏదో ఒక ఉపాయం ప్రాణం పోసుకుని పరిస్థితిని మార్చకపోదు.

ఈ నమ్మకం ఒక అభయహస్తమై భుజం తడుతుంటే చావలేక బతుకుతున్నాను!...

* * * *

కాళ్లకు నడక తెలిసి చేతులు పనులకు పనికొచ్చే పరికరాలని గ్రహించేటప్పటికి నేను ఒకఇంట్లో అంట్లుతోముతున్నాను. బాధ్యత చేతుల్నియంత్రాలుగా నియంత్రిస్తే 'అంట్లుతోముడు' కార్యక్రమం సజావుగా సాగిపోతూ ఉంది. అయితే ఈతోలు పంజరంలో మనసు చిలక ఒకటి ఉందిగదా? అది రెక్కలు విప్పుకొంటుంది.

"ఎవరు నువ్వు? ఈ లోకంలోకి ఎలా వచ్చావ్? నీ తల్లి ఎవరు? తండ్రి ఎవరు? ఈ ఇంట్లోకి ఎలా వచ్చావ్? ఈ తోముడు కార్యక్రమంతోనే నీజీవితం తరిస్తుందా? లేదు. బయటపడే మార్గమేమైనా ఉందా?" అంటూ ఎన్నో ప్రశ్నలు జూలు విదిలిస్తూ పైకిలేస్తాయి. అప్పుడు నాచూపులు అప్రయత్నంగా గోడమీద అద్దంమీద పడతాయి. అద్దంలో నన్ను నేను చూసుకొంటాను.

అద్దం ఎప్పుడూ అపద్ధం చెప్పదు.

మసి బారిన బోకుల్ని తోమేకుందికే తళతళా మెరిసినట్లు నన్ను నేను అద్దంలో చూసుకొంటుంటే పెదాలమీద విరిసీవిరియని పువ్వులా ఒక చిరునవ్వు!

ఆ చిరునవ్వే ఒక అభయహస్తం!- అభయహస్తమంటే ఈగది నాలుగు గోడల మధ్యనుండి... అంట్లు తోమే కార్యక్రమం నుండి విడుదల చేయడానికి దిగివచ్చిన పుష్పక విమానమేమీ కాదు.

ఒక ఆడదాని అందమే కదా ప్రపంచవింతల్లో ఒకటైన తాజ్‌మహల్ నిర్మాణానికి కారణమైంది. ఆ మాటకొస్తే సామ్రాజ్యాలు సాధించింది..నిలబెట్టింది...కడకు కుప్పగా కూలదోసిందీ ఆడదాని అందమే కదా?

అయితే ఆ అందం నాకుంది!

అందం తల్లిదండ్రుల నుండి సంక్రమించే ఏకైక వారసత్వం. ఇదే నిజమైతే ఇద్దరు అనాకారుల మధ్య జరిగిన సంభోగేచ్ఛకు సంతకం కాదు నారూపం. నాగరికత చేసిన ప్రేమ సంతకం నా అందం. ఇందులో అబద్ధానికి ఆవగింజంత చోటు లేదు.

ఎవ్వడో ఒక కొవ్వెక్కిన మగవాడు ఒక అమాయక అందాలరాశి బతుకులో కోటి ఆశాజ్యోతుల్ని వెలిగించినట్లు వెలిగించి మలిగించే ప్రయత్నంలో ఆరిపోకుండా జ్వలించిన అందాల జ్యోతిని నేను! లేదా–

కలిగిన ఇంట్లో ఒక అందాలకన్నెపిల్ల కాలు జార్తే ఆ ఇంటి మట్టూ మర్యాదలు నన్ను నిర్దాక్షిణ్యంగా కుప్పతొట్టి ఉయ్యాల్లోకి నెట్టేస్తే కాకులు కుక్కల నోట మట్టిగొట్టిన గట్టిపిండాన్ని నేను!

అన్నట్లు నేను అందగత్తెనన్నాను కదా! అసలు అందాన్ని కొలిచే పరికరాలెక్కడున్నాయ్? అవి కండ్లే. ఎవరికండ్లు వాళ్లవి. ఎవరి అందం వాళ్లది. కొన్ని కండ్లు ఆరాధించే అందాలను కొన్ని కండ్లు నిరసించవచ్చు.

అద్దంతో నామూగ సంభాషణ కొనసాగుతూ ఉంటుంది.

అది అమ్మగారి కంట పడుతుంది.

"ఏమే? అంతో ఇంతో ఎర్రంగా బుర్రంగా ఉన్నావే అనుకో. కనుముక్కూ తీరుచూడ ముచ్చటగానే ఉన్నాయ్. అయితే అప్పుడే అందాన్ని అద్దంలో చూసుకొని మురిసి పోతున్నా వంటే?"...

ఆ ఎత్తిపడుపుతో అద్దం మూతి ముడుచుకొంటుంది. చూపులు పాత్రలమీది మురికితో తలపడతాయి. అంట్లు తోమే కార్యక్రమం చకచకాసాగిపోతుంది. ఆమని వేళ్లే గుండె హార్మోనియమ్‌ని పలికిస్తుంటే మనస్సు గొంతులో సరికొత్త ఆలోచనల రాగాలు!

నిజమే కదా? ఆమె అన్న మాటలు అక్షరసత్యాలే కదా? ఈ వయస్సులోనే నేను అందగత్తెను అన్న భావన కలిగిందంటే? ... రేపు వయసు వస్తే?.... కన్నెరికం ఊడేరితే? ఈ భావం ఇలానే బలపడ్తే?– గుండెదడ. సన్నగా వణుకు. ఒళ్ళంతా చెమటలు. మనస్సు గాలిలో దీపం. ఏ క్షణంలో ఆరిపోతుందో అన్న భయానికి ఆయన అరిచేతుల దీగూడు చక్కని గూడు కట్టేది. ధైర్యం సూదిమందులా పనిచేస్తే నాచేతుల చైతన్యానికి ఆ ఇల్లే వొళ్ళు విరుస్తూ వగలు పడేది.

ఆయన ఒక బడి పంతులు.

ఆయన్ను చూస్తే సమస్త సద్గుణాలు ముందు పుట్టి ఆతర్వాతనే ఆయన పుట్టాడనిపిస్తుంది. ఆయన చేతులకు ఆత్మీయతాస్పర్శ ఉంది. చూపులకు వెలుతురు ఉంది. వ్యసనాలన్నీ ఆయనకు పాదాభివందనం చేస్తే ఆయన ధ్యేయమంతా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడమే! బడి వేళల్లోనే కాదు- బడివదిలితే ఆఇల్లే ఒకబడి!

ఆయన కనుబొమ ముడిపడింది కానీ... గొంతు తడబడింది కానీ... కన్ను తడి అయింది కానీ నా కంటపడలేదు. పరిసరాలను ప్రసన్నం చేసుకోవడానికి విడుగుతున్న మొగ్గే ఆముఖం. సంతృప్తికి సాక్షి సంతకాలు ఆ కండ్లు. ఆత్మస్థైర్యాన్ని వెదజల్లే తేనెలద్దుకొన్న పలుకుల్ని ప్రతి విరుపులో పొదివికొన్నవే ఆ పెదవులు. దిగులూ వ్యసనం బాధా వ్యథలవంటి పీడితశక్తులు అనిష్టు హృదయాన్ని చెనకలేక చతికిలబడ్తే ఆయన ఎప్పుడో ఏకాంతంగా కూర్చున్న సమయాల్లో మాత్రం భారంగా నిట్టూర్చేవారు. ఆనిట్టూర్పు సముద్రాలను దాటి తన ఏకైక కుమారుని గుండెల్ని తాకలేక గాలిలో కలిసిపోతే వత్సుడి తిరిగిన ఆపెదాల్లో 'అద్దాలనాడు బిడ్డలేకాని గద్దాలొస్తే కాదు గదా?' అన్న భావన మెరుపుతో పోటీ పడినట్లుండేది.

కానీ అమ్మగారు మాత్రం అవకాశం దొరికినప్పుడంతా కొడుకు తెలివి తేటల్తో కలిసి ఆకాశమంత ఎత్తెగిరి అమెరికా తలపోతలలో తడిసి నింగికి హద్దులు వెదుకుతుంటే- తనబిడ్డ తనకే కాకుండా పోయాడే అన్న బాధ పిడుగై నెత్తిన పడ్తే పాతాళంలో పడి విలవిల లాడడం నిత్యకృత్యంగా ఉండేది.

నేను మాత్రం కాలప్రవాహంలో ప్రవాహ వేగంతో పోటీపడ్తూ కొత్తకొత్త అందాలను సంతరించుకొంటున్న నా ఒంటిమీద ఒంపుల్ని గమనిస్తూ అనూహ్యమైన భవిష్యత్తులో మలుపులు ఊహకందక ఉక్కిరిబిక్కిరయ్యేదాన్ని. నిస్సహాయత నిలువెత్తు గోతిలోకి నిర్దాక్షిణ్యంగా నెట్టేస్తే పడ్తూలేస్తూ పైకి లేచి మనస్సును నిట్టూర్పుల్తో గువ్వదువ్వలు దువ్వుతూ సముదాయించే దాన్ని!

ఆ ఇంట్లో ముగ్గురే ముగ్గురు. ముగ్గురూ మూడు దిక్కుల్లో నిబలడి ఎవరి ఆలోచనలు వాళ్లవిగా కొనసాగుతుంటే మాతో నిమిత్తం లేని కాలం తనపని తనదంటే రాత్రింబవళ్లు. అవి ఒకదాని వెంటపడి ఒకటి తరుముతున్నట్లుగా పరుగెత్తడం... కరచాలనంతో వీడిపోవడం... ఉదయసంధ్యలుగా రూపొందడం- మనోహర దృశ్యాలైనా కష్టాలైనా సుఖాలైనా శాశ్వతం కాదనడానికి ఇవి సాక్షిసంతకాలా? కావచ్చునేమో?-

ఆ ఇంటి మట్టసానికి అందరికంటే ముందుగా అమ్మగారే నిద్ర లేస్తారు. కాలకృత్యాలు తీర్చుకొంటారు. స్నానం చేస్తారు. పుజామందిరానికి అంకితమైపోతారు. వాస్తవానికి అమ్మగారిది అమరిన కాపురం. అంత అంకితభావంతో ఆమె దేవుడికి సమర్పించాల్సిన కోరికల హారం ఏముంటుంది? బహుశా 'నా ఒక్కగానొక్క కొడుకును నాకు దక్కేటట్లు అనుగ్రహించు స్వామీ!" అన్న కోరిక ఆహారంలో తురాయి పువ్వు కావచ్చు. అయితే ఈ దేశంలో ఆమెవంటి అభాగినులెంతమంది? పాపం! ఆ దేవుడు మాత్రం ఎంతమంది మొరలాలకిస్తాడు? ఎంతమంది కోరికలు తీరస్తాడు? ఫలితంతో నిమిత్తం లేకుండా నమ్మకమే ప్రాధాన్యత వహిస్తున్న కారణంగా ఈ దేశంలో గుడులకు కొదువ లేదు. భక్తులకు అంతకంటే తక్కువ లేదు.

ఈ గుళ్లూ గోపురాలు భక్తులను తలుచుకుంటుంటే ఈ పరిస్థితిలో కూడా నాకు నవ్వాలనిపిస్తుంది. మనిషిని మనిషిగా ప్రేమించగలిగితే ఇవన్నీ అవసరమా? అని.

సరే! ఎవరిపిచ్చి వాళ్లకానందం. అమ్మగారు పూజామందిరానికి అంకితమై ఆమాత్రం మానసిక ప్రశాంతత పొందగలుగుతున్నారంటే-అది ఆనందించవలసిన విషయమే కదా?

ప్రతినిత్యం అమ్మగారి పూజాకార్యక్రమానికి ముక్తాయింపు గంటానాదం. ఆ నాదం శ్రవణపేయమై ఆనాటి బాధ్యతల్ని గుర్తు చేస్తే నేను ఎగిరిపడి లేస్తాను. నాజీవితానికి రక్షణకవచంగా నిలిచిన వంటగది చేతులెత్తి ఆహ్వానం పలుకుతూ ఉంటుంది. చేతిలో చేయి గలిపి ఆగదికి పరిమితమై పోతాను. అయ్యగారు కూడా ఈ సంఘటనతో స్పందించినట్లు కాలకృత్యాలు తీర్చుకొని అప్పటికే ఇంటి ముందు వరండాలో కాచుకొని కూర్చున్న విద్యార్థుల్లో ఒక విద్యార్థి కావడం విశేషం!

ఏమాత్రం మార్పు చేర్పులకు అవకాశమేలేని దినచర్య. కాలగతిలో ఒక అలవాటై పెత్తనం చలాయిస్తుంది. ఆ రోజు ఉదయం అలవాటు మేరకు మెలకువ వచ్చింది. అయితే నా మెలకువ పూజామందిరంలో గంటానాదంతో ముడిపడింది కదా? ఆనాదమే చెవిని పడలేదు. కాస్త ముందుగా మెలకువ వచ్చిందేమో?- అనుకొంటూ బద్ధకంగా పడకమీదనే అటూఇటూ పడి దొర్లుతున్నాను. నాబద్ధకం కొంచెం కొంచెంగా నంజుకొంటుంటే కాలం మెల్లగా కరిగిపోతూ ఉంది. ఎంతసేపటికి పూజకు ముక్తాయింపు చెవిని పడలేదు. లేచి కూర్చున్నాను. సందేహం నాచేయిపట్టి పైకిలేపింది. మెల్లగా పూజామందిరానికి నడిపించింది. మసక చీకట్లలో వెలుగు శిఖరంలా దేదీప్యమానంగా వెలిగిపోయే పూజామందిరం చీకటి గుయ్యారాన్ని తలపింపచేస్తూ ఉంది. నా బద్ధకం బద్దలైంది. ఒక్క ఊపులో అమ్మగదిలోకి జొరబడ్డాను. లైట్ వేశాను. అమ్మ ప్రశాంతంగా నిద్రపోతున్నారు. లేపాలన్న ప్రయత్నంలో అమ్మవొంటి మీద చేయి పడింది.

అంతే! 'అమ్మా!' అంటూ గుండెల్ని చీల్చుకొని ఒక గావుకేక!

మంచుగడ్డతో పోటీపడ్తూ అమ్మవొళ్లు!

అమ్మ పాదాలమీద పడి నేను రోదిస్తుంటే నిర్వికారంగా పక్కన నిలబడుకొని అయ్యగారు.

ఊరూనాడు ఒక్కటైపోయింది.

"మహాతల్లి పుణ్యాత్తురాలు! పసుపూ కుంకంతో పోయింది."

"మంచోళ్లచావు మరణమప్పుడు చూడమన్నారు పెద్దోళ్లు."

"ఏడ్చినా మొత్తుకున్నా ఏంలాబం? ఈనేలమీద నూకలు చెల్లిపోతే ఎవురిదోవ వాళ్లదే!"

శ్మశాన వైరాగ్యం ఒళ్లంతా వేదాంతాన్ని పులుముకొని అలవాటైన పాతమాటల్నే ప్రవక్తలా ప్రవచిస్తూ ఉంది. అమెరికాకు కపురు చేసే హడావిడిలో కొందరు.

"అయ్యయ్యో! అమ్మ పోయారా! చాలా బాధగా ఉంది. అయినా పూర్ ఇండియాలో నేను వచ్చేవరకు శవాన్ని కాపాడడం ఊహించలేని సమస్య. అదే అమెరికాలో అయితే అది వేరేవిషయం. అనవసరంగా అంత శ్రమపెట్టడం నాకు నచ్చదు. పోనీ! నేను వచ్చినా కంటి

చూపు దక్కిందన్న తృప్తి మిగులుతుంది కానీ మనల్ని శాశ్వతంగా వదిలిపోయిన అమ్మను తేలేను కదా? ఒక వీడియోకేసెట్ తీసిపంపండి. చూస్తూ అమ్మ ఆత్మ శాంతికి కన్నీటి అభిషేకం చేస్తాను."

బతుకుతున్నది అమెరికాలో అయినా పుట్టింది మాత్రం వేదభూమిలో కదా? ఈ మట్టి అడుగడుగునా వెదజల్లే వేదాంతథోరణి ఎవడికైనా పుట్టుకతోనే బాగా ఒంట పట్టుతుంది. నాగరికత ఆలాపించిన ఉపశమన వాక్యాలు పాటకు పల్లవిలా పరిమళించినా తండ్రిని ఊరట పరిచే ప్రయత్నంలో అపస్వరాలై అభాసపాలయ్యాయి!

"పిలుపు అందినా పేగు తెంచుకొని పుట్టిన బిడ్డ పిడికెడు మట్టేసేదానికి రాలేదు" అన్న వార్తతో చుట్టు పక్కల పల్లెల గుండెలన్నీ కండ్లల్లో కరిగితే కన్నీటి ప్రవాహం. ఆ ప్రవాహంలో పూలతెప్పపై ఊరేగిన అమ్మగారు గుండె గుండె పిడికెడు మట్టిగా చేతికొస్తే క్షణాల్లో మట్టికి మరుగైపోయారు.

* * * *

అమ్మగారు బతికున్న రోజుల్లో ఆ ఇంట్లో కొన ఊపిరితో కొట్టు మిట్టాడిన మానవ సంబంధాలు ఆమెతోనే వెళ్ళిపోయినట్లనిపించింది. ఇంటి చుట్టూ ఇండ్లు. అప్పుడూ ఉన్నాయి. ఇప్పుడూ ఉన్నాయి. వాటితో ఏండ్లుపూండ్లుగా కొనసాగిన సాహచర్యం ఉన్నట్లుండి తెగిపోయిన స్థితి. ఈ ఇల్లు ప్రత్యేకంగా ప్రశాంతతలో దిగ్బంధనం చేసినట్లు గంభీరంగా. ఆ వాతావరణంలో రెండు మరబొమ్మలు. కీయిచ్చి విడిచిపెట్టిన మర బొమ్మలు. కాలం చేతిలో కీలుబొమ్మలు. ఏ వైవిధ్యమూ లేని వంటా వార్పు కార్య క్రమంలో వైధవ్యాన్ని భరించినంత ఓర్పుతో నేను. అజ్ఞానం చీకట్లలో అక్షర జ్యోతుల్ని వెలిగిస్తూ అయ్యగారు. ఒక క్రమబద్ధమైన దినచర్య- కాలం కేలండర్లో క్యూలో నిబడిన దినాల్ని ఒక్కొక్కదాన్ని పరామర్శించుకొంటూ తొలగిపోతూ ఉంటే ఏదో ఒకదినం తప్పనిసరిగా కేలండర్లో కాగితం చినిగిపోతుంది. అలా ఎన్ని కాగితాలు చినిగిపోయాయో గుర్తు లేదు. కానీ ఆదినం మాత్రం చెరిపినా చెరిగిపోని ఒక స్మృతిగా!

ఆరోజు బడిలేదు. అయ్యగారు తనగదిలో ఏవో పరీక్షాపత్రాలు దిద్దుకొంటున్నారు. నేను ఆరోజు మధ్యాహ్నం వంటకాలకు రుచులు సమకూర్చాలని సతమతమవుతున్నాను. అప్పుడు 'అమ్మాయ్!' అన్న అయ్యగారి పిలుపు. తగు పాళ్లల్లో కుదిరిన కూర తిరగమోత గుబాళింపు!!

నిజం చెప్తున్నాను. నా పుట్టుకమీద నాకే నమ్మకం లేనిదాన్ని. ఇక దేవుళ్లూ దెయ్యాలమీద ఎలా నమ్మకం కుదురుతుంది?– అందుకే నావంట గది సాక్షిగా చెప్తున్నాను. ఆ గదిలో నేనెవరో నాకు తెలియని దశలో అడుగుపెట్టాను. ఆగదిలోనే నన్ను నేను తెలుసుకొన్నాను. ఈ మధ్యకాలంలో అయ్యగారు పిలవడం లెక్కపెట్టే వేళ్లే మిగిలిపోతాయి. ఆ స్థితిలో 'అమ్మాయ్!' అన్న పిలుపు!

అక్షరక్షరం తేనెలద్దుకొని తీపిగొలిపే ఆ పిలుపు పులకరింతలో వంటపనుల్ని కాలం కొక్కానికి తగిలించి ఒక్క అడుగులో అయ్యగారి ముందు నిలబడ్డాను.

ఏ చిక్కుసమస్యతో తల బరువెక్కిందో?... ఎప్పుడు తలవంచని మనిషి తల వాలిపోయింది. ఏదో చెప్పాలన్న ప్రయత్నం... చెప్పలేని నిస్సహాయతల మధ్యనలగడం... బాగా కనిపిస్తూ ఉంది. భారమైన నిట్టూర్పుల్ని టేబిల్‌మీద కాగితాలు ప్రతిఘటిస్తున్నట్లు చలిస్తున్నాయి. అడుగుల సవ్వడితోనే నారాకను గమనించినట్లుంది. 'కూర్చో అమ్మాయ్!' అన్నారు.

ఆమాట కాదనలేను. ఆసాహసం చేయలేను. చలనంలేని బొమ్మతో పోటీపడినట్లుగా నిలబడ్డాను.

ఎంతోమంది విద్యార్థులకు అనర్గళంగా పాఠాలు చెప్పి చెప్పి వాళ్ల భవిష్యత్తును తీర్చిదిద్దిన నోరు ఆ క్షణంలో మూగపోయినట్లనిపించింది.

కాలం కండ్లకు గంతలు కట్టలేం కదా? గ్రహించినట్లుంది అయ్యగారు.

"ఇక సరిగ్గా ఒక్క ఏడాదిలో నేను రిటైరవుతానమ్మాయ్!"

ఒక రహదారి ఎంతదూరం సవ్యంగా సాగినా ఎక్కడో ఒకచోట చిత్రంగా మలుపు తప్పనట్లు ఉద్యోగం బతుకుబాటలో రిటైర్మెంట్ ఒక తప్పని మలుపు. ఇది సహజమైనా ఆక్షణంలో చిత్రమైన తడబాటు. నిబ్బరించుకొన్నాను.

"పిల్లలకు పాఠాలు చెప్పడంలో రిటైర్మెంట్ లేదు గదయ్యా?"

"అది నిజమే అనుకో. అయినా ఇప్పుడు నన్ను వేధిస్తున్న సమస్య అదికాదు.'

ఎదురైన ప్రతి సమస్యను ఎంతో తేలిగ్గా తీసుకొని సమస్యల జీవితాలకు పరిష్కారాల్ని సూచించిన అయ్యగారేనా మాట్లాడుతున్నది? అన్న సందేహం మొగ్గతొడిగి వికసిస్తుంటే–

"ఇప్పుడు నువ్వేనమ్మా నాకొకసమస్య!"

"హేభగవాన్! నేనే ఒక సమస్యా? నిలబడినచోట నేల రెండు పాయలుగా చీలిపోతే?... నేలతల్లి కడుపులో నన్ను ఇముడ్చుకొంటే?... నేను మిగలను. నావల్ల ఉత్పన్నమైన సమస్యకూడా మిగలదు. అంత అదృష్టమే నానొసటన రాసి పెట్టుంటే?..."

"ఈ లోకంలోకి నువ్వెలా వచ్చావో నాకు తెలియదమ్మాయ్. ఈ ఇంట్లోకి నువ్వెలా వచ్చావో నీకు తెలియదమ్మాయ్!"

'నీళ్లు దప్పిక తీరుస్తాయ్!' అన్నంత నిజం.

"ఆరోజు మధ్యాహ్నం బడి వదిలి ఇంటికి వస్తున్నా. బడికీ ఇంటికీ మధ్య దూరం మూడు కిలోమీటర్లు. ఆ దూరం మారలేదు. నాసైకిల్ ప్రయాణంలో మార్పు లేదు. సైకిలు మీదనే వస్తున్నా. చెట్టు నీడలో నువ్వు. ఏ వనదేవతో తాను చేసిన తప్పిదానికి భయపడి నిన్ను చెట్టు కింద వదిలినట్లనిపించింది. నీచూపులు ఆదారిలో వస్తూపోతున్న గుండె గుండెను గుచ్చి చూస్తున్నాయి. ఏ గుండెలో అయినా చోటు చేసుకొన్న రవ్వంతదయ చేరదీయదా? అన్నట్లుగా. ఎవరితాపత్రయం వాళ్లదైన ఈ లోకంలో అలాంటి చూపుల్ని పట్టించుకోగలిగితే?– ఈదేశం! ప్చ్! అదొక అందమైనకల. నీచూపులు గాలమేసి నన్ను నిలబెట్టాయి. సైకిల్ నిలిపి! 'రామ్మా!' అన్నాను. ఆ పిలుపు చిరునవ్వుల సవ్వడిలా చక్కలిగింతలు పెట్టిందో? తిరుగులేని నమ్మకమై

చేయిపట్టి నడిపించిందో? ఏమాత్రం తటపటాయించకుండా వచ్చావు. సైకిల్లో కూర్చోబెట్టుకొని ఇంటికి తెచ్చాను. 'ఆడపిల్ల లేని లోటు తీరుస్తుంది 'అంటూ అమ్మగారికి అప్పగించాను."

ఆ మాటలకే అలసిపోయినట్లుగా ఒక దీర్ఘమైన నిట్టూర్పు!

ఆ తర్వాత చెప్పడానికేమీ లేదని ఆయనకు తెలుసు. అయితే ఏదో చెప్పడానికే నన్ను పిలిచారు. అది నాకు తెలుసు.

"నువ్వొక దిక్కులేని దానివి కాకూడదమ్మా!"

నిజానికి కావాల్సిన దాన్నే. ఏదారి ఎటు పోతుందో? ఏదారి పట్టినా తల తిరిగి నోటీ దగ్గరికే వచ్చినట్లుగా మళ్ళీ జనారణ్యంలోకే గదా? అక్కడ ఏ మనిషి మనిషిగా మిగలతాడో? మృగమే అవుతాడో? ఆ చేదు అనుభవాల నరకం నుంచి విముక్తి పొంది స్వర్గంలో ఉన్నాను కదా? ఆ ధీమాతోనే–

"మీరుండగా నేను దిక్కులేని దాన్నెలా అవుతానయ్యా?"

"నేనుండగా కాదు!.... నాతదనంతరం".

"హుం! తమ తదనంతరం కూడా బతకాలన్న స్వార్థం లేదయ్యా!"

"అమ్మాయ్! జన్మాన్ని వద్దనుకోవడానికి కావాలనుకోవడానికి మనకు అర్హత లేదు. ఈ జన్మ ఎలా వచ్చిందో మనకు తెలియదు. ఎప్పుడు ఎలా పోతుందో కూడా మనకు తెలియదు. తెలియని దాన్ని గురించి చర్చించడం వృథా. కాబట్టి మనం మనంగా మిగిలినపుడే మిగిలిన జీవితాన్ని గురించి ఆలోచించాలి."

"ఈ ఇంట్లో ఆ అవసరం నాకు లేదయ్యా!"

"నీకు లేకపోవచ్చు, కానీ.... నాకుంది."

"అది బొత్తిగా నాతో ప్రమేయంలేని పని."

"అమ్మాయ్! మేము స్వార్థంతో నీ బ్రతుకును కేవలం వంటింటికే పరిమితం చేసినా నువ్వు మాత్రం పరిమితం కాలేదు. నేను అక్షరాలు మాత్రమే నేర్పాను. కలిపి చదువుకొనే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నావ్. విద్య వివేకంతో ముడిపడింది. చాలా తెలివిగా మాట్లాడుతున్నావ్."

"క్షమించదయ్యా! అడిగిన దానికి సమాధానం చెప్తున్నాను కానీ– తెలివిమీరి మాట్లాడడం లేదు."

"తెలివి మీరి మాట్లాడుతున్నావని నేననలేదు. తెలివిగా మాట్లాడుతున్నావన్నాను. రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంది. అది అలా ఉండనీ. చాలా దినాలుగా సతమతమవు తున్నాను చెప్పాలని. ఎలాచెప్పాలో తోచక ఏదినానికాదినం నాకునేనుగా వాయిదా వేసుకొంటున్నాను. ఇక వాయిదాలకు అవకాశం లేదు. ఈరోజు చెప్పక తప్పదు. కానీ...."

"కడుపులో పుట్టిన బిడ్డకంటే ప్రేమగా పెంచుకొన్నారు. కంటికి రెప్పగా కాపాడుతున్నారు. నాతో చెప్పడానికే సంకోచిస్తున్నారా అయ్యా!"

"ఆఁ! ఆఁ! అక్కడే అమ్మాయ్ వచ్చిన చిక్కంతా!"

"అంటే?"

"అంటే- అది నీభవిష్యత్తుతో ముడిపడి వివరణకు లొంగని చిత్రమైన పరిస్థితి."

"అయ్యా! ఇప్పటికే మీరు చాలా అలిసిపోయారు. అర్ధాంతరంగా విడిచిపెట్టి తెలియని తీరాలకు వెళ్లిపోయిన అమ్మ.... చేతికి ఎదిగినా బతుకులో వాదగని కొడుకు- మీకు చేతులెత్తి నమస్కరిస్తాను. దయచేసి నన్ను గురించి మనసు పాడు చేసుకోకండి."

"అమ్మాయ్! ఏడ్చినా మొత్తుకొన్నా మీఅమ్మ ఈ జీవితంలో ప్రవేశించడం అసంభవం. పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో తేనెలో ఈగ- కొడుక్కు ఏనాడో మానసికంగా పిండ ప్రదానం చేసేశాను. మిగిలింది నువ్వు. నువ్వుగా నిలబడాలంటే?"

"చెప్పండి. నన్నేంచెయ్యమంటారో చెప్పండి."

"ఎలా చెప్పాలో గొంతు పెగలకనే కదా?"

"నన్ను నన్నుగా నిలబెట్టే ప్రయత్నంలో గొంతు పెగలక పోవడమా?"

"అవును. ఈ చేతుల్తో చేయలేని పనిని చేయాల్సిన అవసరం!"

"మీ చేతుల్తో చేయలేని పనా?"

"అవును. ఈ చేతుల్తో చేయలేనిపనే. అయినా తప్పదు. నీ మెడలో మూడుముళ్లు!"

"ఆ!"

"అవునమ్మాయ్! కొడుకు ప్రయోజకుడై ఉద్ధరిస్తాడనుకొన్న ప్రయత్నంలో అర్ధాంగిని పోగొట్టుకొన్నాను. నేను మిగిలాను. ఇదో ఈబాడుగ ఇల్లు మిగిలింది. విద్యతో వ్యాపారం చేయలేకపోయిన కారణంగా బ్యాంకులతో అవసరం లేకపోయింది. నాతదనంతరం జీవనాధారం నాపెన్షన్ ఒక్కటే. దాన్ని అనుభవించే అర్హత ఒక్క భార్యకే ఉంది. ఆమె పోయింది. ఆస్థానాన్ని నువ్వు పొందితే తప్ప గత్యంతరం లేదు. అందుకే ఈ కఠోర నిర్ణయం."

అప్పుడప్పుడు పిల్లలకు దానధర్మాల గురించీ త్యాగాల గురించీ కథలు కథలుగా చెప్తుండేవారు. ఆ త్యాగం నాతోనే మొదలయిందా?

"చూడమ్మాయ్! ఒక్కదినం కాదు. రెండు దినాలుకాదు. కొన్ని ఏండ్లుగా నా ప్రవర్తన గమనిస్తున్నావ్. శారీరక సౌఖ్యాల వలయంలో నుండి నేనెప్పుడో బయటపడ్డాను. దీనికి ప్రతిరాత్రి నీపక్కలోనే పడుకొన్న మీ అమ్మే సాక్షి. నాతదనంతరం ఎలా జీవిస్తావ్? ఒక్క పెన్షన్ మినహా నాది అని చెప్పుకోవడానికి ఏమున్నది? నీభవిష్యత్తును దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం. తొందరేమీ లేదు. బాగా ఆలోచించుకో. నీ నిర్ణయాన్ని గౌరవించే సంస్కారం నాకుంది." అంటూ నాకు ఏకాంతాన్ని కల్పించి వెళ్లిపోయారు.

జీవితంలో ఈ సంఘటన ఎంత చిత్రమైందో అంతకంటే ప్రాముఖ్యమైంది. అయ్యగారేమో తన గుండె బరువును చాలా తేలిగ్గా నాగుండెల మీదికి నెట్టేసి వెళ్ళిపోయారు. ఈ లేతగుండెకు అంతబరువును మోసే శక్తి లేదు. నా ఆసరాతో అయ్యగారు తనగుండె బరువు దించుకొంటే నాగుండె బరువు ఎవరు దించాలి?

జీవితాన్ని సవాలు చేస్తూ రెండు ప్రశ్నార్థకాలు. శారీరక సౌఖ్యం. భవిష్యత్తు. ఏది కావాలన్నా ఇంకొకదాన్ని తప్పనిసరిగా వదులుకోవాలి. అయితే రెండూ రెండే. దేని ప్రాముఖ్యత దానికి ఉంది. కోరికలగుర్రాలెక్కి వయసు ఊరేగమంటుంది. అయితే భవిష్యత్తు? ఆయన తదనంతరం ఈ అందాల విస్తరిని కుక్కలు చింపవన్న నమ్మక మెక్కడుంది?

వారాలు తిరగలేదు.

"అమ్మో! అది సప్తకిలాడిగా ఉండాదే? ముసిలోణ్ణి వల్లో యేసుకుణ్ణిందే?" అన్న కూతలు గుండెను అడ్డదిడ్డంగా కోత కోస్తుంటే నిట్టూర్పుల లేపనంతో గాయాల మాన్పుకొనే ప్రయత్నం!....

నా బతుకు్కు తిరుగులేని భద్రత కల్పించి అక్కడికి తన బాధ్యత తీరిపోయినట్టుగా నన్ను ఏకాకిని చేసి అంతతొందరగా వెళ్లిపోతారని నేను కలలోకూడా ఊహించలేదు.

ప్రతినిత్యం ఆయన ఫోటో ముందు నిలబడి "ఈ ఇంటిని ఒక సేవా సదనంగా మార్చే ప్రయత్నంలో తోడుగా ఉండండి. ఏ బలహీనతలకు లోను గాకుండా నన్ను కాపాడండి." అని ప్రార్థించడం నిత్యకృత్యమైంది.

ఆరోజు ప్రార్థనలో అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. నా పాపాన్ని కడగడానికి ఆయన ఆశీస్సులు అశ్రుపుష్పాలుగా మారి అభిషేకిస్తుంటే మనస్సు తేలికపడింది. కండ్లు తెరిచాను.

ఎదురుగా అతడు!

ఎదుట పడ్డానే నాముఖంలోకి ఎగ్గొట్టుకొచ్చిన అసహనం అతన్ని కుంగదీస్తే ఆ పరిస్థితి నుండి తప్పించుకొనే ప్రయత్నంలో ఒక్క అడుగు ముందుకు పడింది.

"మేడమ్! దయచేసి ఒక్కక్షణం నిలబడండి. ఈ ఒక్కమాట సావధానంగా విని వెళ్ళండి. అయ్యగారు ఏలోకాల్లో ఉన్నా ఆయన ఆత్మమాత్రం ఈ పరిసరాల్లోనే పరిభ్రమిస్తూ ఉంటుంది. ఆ ఆత్మసాక్షిగా చెప్తున్నాను. ఆయన రెండు కండ్లల్లో ఒక కన్ను నేను. రెండు చేతుల్లో కుడిచేతిని నేను. ఈ చేతులు పట్టుకొని ఆయన ఎన్నిసార్లు బ్రతిమాలాడో? 'మూర్తీ! అమ్మాయి అనాఘ్రాతపుష్పం. ఆలోచించి ఆలోచించి నాపెన్షనుకివారసురాల్ని చేయడానికే ఆమె మెడలో వేయలేని మూడుముళ్లు వేశాను. అవసరాలు వేరు. కోరికలు వేరు. అవసరాలు తీర్చే నెపంతో మంచి పరువం ప్రాయం మీదున్న ఒక వ్యక్తి కోరికలపై నిప్పులు చల్లాను. అందుకే నిన్ను అభ్యర్థిస్తున్నాను. నేను భద్రత కోసం వేసిన మూడుముళ్లు నీఔదార్యంతో మీ ఆదర్శదాంపత్యానికి నకళ్లు కావాలని!' ఈ మాట సూటిగా మీతో చెప్పలేక చెప్పకుండా ఉండలేక నాలో నేను కుములుతున్నాను. ఈరోజు అటోయిటో తేల్చుకోవాలన్న నిర్ణయంతో తెంపు చేశాను. మీరు సరేనంటే- జీవితంలో మీమాటకు కట్టుబడే నాజీవితాన్ని మలుచుకొంటాను."

ఇదో కొత్తఎత్తా? ఏమో? అవసరాలకు అబద్ధాలను అందంగా సృష్టించే ఈ మగజాతి అంతకంటే తెలివిగా వాడుకొంటుంది. జాగ్రత్తగా జారుకొంటుంది. ఈ మనుషుల్ని ఎలా నమ్మను? అందుకే-

"నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి." అన్నాను.

మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు- నా గుండెల్లో తుఫాను సృష్టించి!

అతనితో పరిచయమే లేదు. ఊరూ పేరు వివరాలేమీ తెలియవు. అయినా చిత్రంగా ప్రతి ఆలోచనకు అడ్డు తగులుతున్నాడు.

అయ్యగారు బతికున్న రోజుల్లో ఆయనతో కలిసి అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడు. వస్తే ఆయన కాఫీ తెమ్మనే వారు. తెస్తే నావైపు కన్నెత్తి చూస్తే ఒట్టు. చెప్పుకోదగ్గ అందగాడే మరి? అయినా నా అందాన్ని కూడా లెక్కచేయని ప్రవరుడా? అని చాలాసార్లు చిలిపిగా ఆలోచించే దాన్ని. అది నాతప్పు కాదు. వయసుది.

ఈవేళ అతగాడే ఒక సమస్యగా మిగిలాడు!

ఏమాటకామాట చెప్పుకోవాలి. అయ్యగారు పోయినపుడు బాధ్యత అంతా తనదే అన్నట్లుగా ముందున్నాడు. పెన్షన్ చేతికి రావడానికి తనవంతు కృషి చేశాడు. అయితే ఎప్పుడు కానీ వెకిలిగా వెలితిగా ప్రవర్తించలేదు. ఆ ప్రవర్తనే నా ఆలోచనకు దోహదం చేస్తున్నదేమో? ఏది ఏమైనా ఇప్పుడు నేను తీసుకొనే నిర్ణయం మీదనే నా భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందువల్ల చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. ఇప్పుడు నేను పరిగణనలోకి తీసుకోవాల్సిన ముఖ్యాంశాలు- నాశారీరక అవసరం. జీవితానికి భద్రతగా ఒక మగతోడు. వీటికి మించి ఆయన మాట మన్నించడం!

ఒక స్త్రీగా సిగ్గు విడిచి చెప్తున్నాను- విరహం మనిషిని నిలువునా దహిస్తుంది. ఆ తాపాన్ని భరించలేక ఎన్ని రాత్రులు దెబ్బతిన్న నాగులా పడకమీద పడి మెలికలు తిరిగి పోయానో? ఆ సమయాల్లో ఇది ఇల్లు కాదు. నన్ను నిర్దాక్షిణ్యంగా బంధించిన జైలనిపించేది. కొన్ని సమయాల్లో కనీసం మగస్పర్శతో అయినా తపన తీర్చుకోవాలన్న కాంక్షతో ఆయన గదిలోకి జొరబడేదాన్ని. ఆయన లేచికూర్చొని ఆప్యాయంగా నాతల నిమురుతూ ఉంటే నిస్సహాయత కన్నుల్లో కరిగి నీటిబొట్టుగామారి ముత్యమైరాలిపడ్డే ఎగ్గొట్టుకొస్తున్న ఏడుపును ఎలా దిగమింగు కున్నానో?

ఆయన సహృదయుడు. నా పరిస్థితిని గ్రహించాడు. జాలి పడ్డాడు. తన తదనంతర మైనా తానివ్వలేని సుఖాన్ని నాకు దక్కించాలన్న అభిప్రాయంతోనే ఇతడిని అభ్యర్థించి ఉంటాడు. ఈనా ఆలోచన సముచితంగా తోస్తే ఆయన ముందు నిలబడ్డాను. అరచేతుల హారతి పళ్లెంలో కోరికల కర్పూరాన్ని వెలిగించాను. హారతి పడ్తూ అరమోడ్పు కన్నులతో ఆయన వైపు చూశాను.

చిరునవ్వుతో చేయెత్తి ఆశీర్వదిస్తున్నాడు!

మెడలో ఆయన వేసిన మూడు ముళ్లకు సాక్షి సబ్‌రిజిస్ట్రార్ అయితే మూర్తి వేసిన మూడు ముళ్లకు గుడిలో దేవుడే సాక్షి!

"ఆస్తిపాస్తులు కొట్టేసే దానికి అప్పుడేమో ముసిలోడికి కొంగేసింది. ఇప్పుడు ఒంట్లో కొవ్వు కరిగించేదానికి తగినోణ్ణే తగులుకుణ్ణింది." నిర్దాక్షిణ్యంగా గాలి మోసుకొచ్చే కూతలకు చెవులు దిమ్మెక్కిపోతున్నాయ్. అయినా వేసిన అడుగు వెనక్కి తీసుకోలేను గదా?

అయితే ఎంతోఆశగా నేను ముచ్చటపడి కట్టుకొన్న కోరికల అందాల మేడలు గాలి మేడలై కుప్పకూలడానికి నెలల అవసరసం లేకపోయింది. ఛీ ! దుర్మార్గుడు. మేకవన్నెపులి. నన్ను లొంగదీసుకోవడానికి ఎంత నయవంచకత్వానికి పాల్పడ్డాడు.

ఆకర్కోటకుడి కిరాతక చర్యలు ఈ నోటితో ఎలా చెప్పమంటారు?

ఇంత చెప్పిన తర్వాత ఇదీ చెప్పకపోతే? ఇల్లే ఒక బార్ అయింది. ప్రతినిత్యం స్నేహితులతో కలిసి తప్ప తాగడం...ఒళ్ళు తెలియనిస్థితిలో నన్ను వివస్త్రగా నిలబడమనడం... కాదు గీదంటే వస్త్రాపహరణం!– "చూడండ్రా! అదృష్టం నాకు ప్రసాదించిన అందాలు!" అంటూ విరగబడి నవ్వడం. ఇలాఇలా ఎన్నెన్ని సిగ్గువిడిచి చెప్పను? ఎలా చెప్పను?...

తాగి తాగి జంతువులా పైన పడతాడు. చేతకాని స్థితిలో చేతికి సోడాబాటిల్. ప్రతిఘటించి నందుకు ఫలితం? చెప్పాను గదా? రొమ్ముల మీద పొత్తి కడుపు కింద కాలుతున్న సిగరెట్ కుంచె చిత్రించిన మచ్చల చిత్రాలు!

అందుకే నామీద నాకే అసహ్యం!....

* * * *

ఆ రాత్రి ప్రసహనంలో ఒక ఘట్టం పూర్తయింది. అలసిపోయిన జంతువు ఒళ్లు మరిచి పడిపోతే– ఒక కాలు ఒక చెయ్యి ఆ శరీరంతో సంబంధం లేకుండా విసిరి పారేసినట్లుగా!... ఆకాలూ ఆచెయ్యి అలానే పడిపోతే?.... వాడి పుంసత్వం మీద పుండు పుడ్తే?... తిరుగులేని వాడి అహానికి అదే విరుగుడు. అప్పుడు నా దైన తీరులో నేను సుఖాన్ని దోసిళ్లతో జుర్రుకొంటూ ఉంటే... వాడు నిస్సహాయంగా చూస్తూ క్షణక్షణం చస్తూ బతకాలి!

ఈ జీవితంలో ఎంత ప్రయత్నించినా దొరకని ప్రశాంతత ఈ నిర్ణయంతో నన్నావహిస్తే 'ఆడదిగా పుట్టడం కంటే అడవిలో చెట్టయి పుట్టడం మేలు' అన్న అరిగిపోయిన మాటను తిరగరాసి చరిత్రపుటల్లో ఒక చెరగని పుటగా మిగిలేది నేను!... నేనే! అన్న ధీమా తక్షణ కర్తవ్యానికి పురికొల్పుతూ! ●

విపుల

(1, ఏప్రిల్ 2003)